క్లుప్తంగా

బండ్లమోటు ఎస్సైగా షమీర్ బాషా బాధ్యతల స్వీకరణ



బొల్లాపల్లి: బండ్లమోటు పోలీస్ స్టేషన్ ఎస్సైగా, ఎస్‌డీ షమీర్ బాషా శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా వినుకొండ పట్టణం నుంచి బండ్లమోటు స్టేషన్‌కు ఆయన రావడం జరిగింది. ఇక్కడ విధులు నిర్వహించిన ఎ.బాలకృష్ణ వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, మండలంలో సమస్యలపై నేరుగా తనని సంప్రదించవచ్చని ఎస్సై షమీర్ బాషా చెప్పారు.

ఎన్‌సీసీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుంది



నరసరావుపేట ఈస్ట్: దేశం గర్వించదగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని ఎస్‌కేఆర్‌బీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ నాగిరెడ్డి తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బీ, సీ సర్టిఫికెట్లు పొందేందుకు అర్హులైన ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులను క్రమశిక్షణలో నడిపి వారి ఉజ్వల భవిష్యత్‌కు ఎన్‌సీసీ మార్గం చూపుతుందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు కలిగిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందని వివరించారు. కళాశాల పాలకవర్గ ప్రతినిధి కె.వి.పురుషోత్తమరావు, 23 ఆంధ్రా బెటాలియన్ సుబేదార్ మహ్మద్ సబూర్, హవల్దార్ మేజర్ పూసర్ల రమేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ వై.అంజిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకట శివ ఏవో వై.రామ్మోహనరెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవో వినుకొండ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

వినుకొండ: ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ వినుకొండ శాఖ నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా ఈవీ అప్పారావు, సహాయ ఎన్నికల అధికారిగా ఆనంద్‌నాథ్, పరిశీలకులుగా రామయ్య వ్యవహరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సెక్రటరీగా పరిసపోగు వరప్రసాద్, ట్రెజరర్‌గా ఎస్.రామస్వామి, వైస్ ప్రెసిడెంట్లుగా రొడ్డా వెంకటేశ్వరరెడ్డి, పి.బాలస్వామి, వెంపటి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా జి.చినగోవిందు, రమణారావునాయక్, జి.కమలాకర్, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా డి.రమాదేవి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం నేటి నుంచి మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగనుంది.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వినుకొండ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీల్లోని కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకుంటే నవంబరు 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ సీనియర్ నాయకులు సంపెంగుల అబ్రహాంరాజు, సాయి, కంచర్ల కోటేశ్వరరావు, మార్తమ్మ, కొండమ్మ, ఏసు, మరియమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర'పై అవగాహన

వినుకొండ: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల నష్టాలు, ఆహారం వృధాలో ఎదుర్కొనే సవాళ్లు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డాక్టర్ సుంకర అనూష మాట్లాడుతూ గుండె జబ్బులు, రొమ్ము క్యాన్సర్, ఇతర స్త్రీ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆంధ్రపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు, మున్సిపల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులపై గోతులు.. వాహనదారుల అగచాట్లు


గోతిలో ఇరుక్కుపోయిన ఆటో

నూజెండ్ల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు పూర్తి స్థాయిలో దెబ్బతినటంతో వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలోని పెద్దవరం, యోగిరెడ్డిపాలెం, గ్రామాల మధ్య రహదారులు భారీ వర్షాల వలన కోతలకు గురై గోతులమయంగా తయారయ్యాయి.

ఆటోలు, ద్విచక్ర వాహనాలు గోతులలో ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గోతుల ధాటికి తీవ్ర ఆయా మార్గాలలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని, తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే సంబంధిత అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు ఆపండి

పీడీఎం నాయకులు


కరపత్రం ఆవిష్కరిస్తున్న పీడీఎం, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పచ్చని వ్యవసాయ భూముల్లో పరిశ్రమలు నిలుపుదల చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించి కరపత్రాన్ని శుక్రవారం మార్కెట్‌యార్డు ఆవరణలో ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కరేడు ప్రాంతంలో పచ్చని పంట పొలాల్లో ఇండో సోలార్ విద్యుత్ ప్లాంటు, శ్రీకాకుళం జిల్లా పలాసలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములు రైతుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకొని ఆ కంపెనీలకు ఇవ్వాలనే ప్రభుత్వ ప్రయత్నాలు విరమించుకోవాలని అన్నారు.

విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని, ప్రముఖ రైతు నాయకులు, రైతు స్వరాజ్య వేదిక బాధ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభిస్తారని అన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడీఎం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్, కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ కన్వీనర్ కొమర వాసు, పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరావు పాల్గొంటారన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, సభ్యులు ప్రసాద్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోట నాయక్, కె.రమేష్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ



శావల్యాపురం: చెత్త నుంచి సంపద వచ్చేలా మహిళలను చైతన్యవంతులుగా చేయడంలో వీవోఏలు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వెలుగు అధికారులు, వీవోఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తను కేవలం వ్యర్థంగా చూడకుండా దాని నుంచి సంపద సృష్టించేలా శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను మహిళలకు అవగాహన కల్పించడంలో వీవోఏలు తమ వంతు కృషి చేయాలన్నారు. అలాగే తడి, పొడి చెత్త గురించి మహిళలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ బోడ్డు యాకోబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఏపీఎం రామారావు, పరిపాలన అధికారులు పద్మజారాణి, రిసోర్సు పర్సన్ అరుణభారతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఘటనా స్థలంలో మృతి చెందిన నరసింహాశర్మ

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలైన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన రెడ్డి నరసింహ శర్మ (24), జగన్‌మోహన్ అమర్ అన్నదమ్ములు. వీరు కొన్నేళ్లుగా తిరుపతిలో పౌరోహిత్యం చేసుకుని జీవిస్తున్నారు. ఇటీవల స్వగ్రామమైన కాకినాడకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. గురువారం తిరిగి తిరుపతి వెళ్లే క్రమంలో నూతన బైపాస్‌రోడ్డుపై నాదెండ్ల వద్ద వాహనం అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొన్నారు. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న నరసింహ శర్మ తలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న జగన్‌మోహన్ అమర్‌కు తీవ్ర గాయాలుకాగా చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. వీరితో పాటు మరో ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరిన రాజమండ్రికి చెందిన కళ్యాణ్, ఆదిత్య ప్రమాదం జరిగిన విషయాన్ని బాధితుల కుటుంబ సభ్యులకు తెలిపారు. నరసింహాశర్మ మృతదేహానికి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫోర్త్ ఎస్టేట్‌పై అక్రమ కేసులు, దాడులు అమానుషం


సమావేశంలో బీసీ నాయకులు

నరసరావుపేట: దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే పత్రికారంగ సంస్థలపై అక్రమ కేసులు, దాడులు చేయటం అమానుషమని బీసీ సంక్షేమ సంఘ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీలైన అధికారంలో ఉన్నప్పుడు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా, ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడుతున్న అన్ని పత్రికలకు సంబంధించిన విలేకరులు, పత్రిక సంస్థలపై దాడి చేయడం అనేది మంచి సంప్రదాయం కాదని అన్నారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వంలో గానీ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గానీ, భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా పత్రిక సంస్థలు, విలేకరులపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం సభ్య సమాజంలో సరైన విధానం కాదన్నారు. ఇటీవల హైదరాబాదులో మహా చానల్ సంస్థపై దాడి, అలాగే టీవీ5, ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, సాక్షి, వార్త, యూట్యూబ్ చానల్స్ ప్రతినిధుల అక్రమ అరెస్టులు, దాడులు చేయటం సరైన విధానం కాదన్నారు. ఈ దాడులు చేసే సంప్రదాయాన్ని బీసీ సంక్షేమ సంఘం ఖండిస్తుందని అన్నారు. యువజన నాయకులు సుతారం విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడు నాగారపు గురు ఆంజనేయులు, కృష్ణబలిజ సంఘం నాయకులు మామిడాల గిరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని చిలకలూరిపేట విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్డీఎస్‌ఎస్ పనులలో భాగంగా విద్యుత్ లైన్లు, మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని డీఈఈ కోరారు.

నేడు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

నరసరావుపేట: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు కోటప్పకొండ రోడ్డు బైపాస్ సమీపంలో కోటి సంతకాల సేకరణ కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని, విద్యార్థి విభాగ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రిప్ పథకాన్ని పరిశీలించిన మైక్రో ఇరిగేషన్ అధికారి



రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో మైక్రో ఇరిగేషన్‌లో భాగంగా సాగవుతున్న పొలాన్ని జిల్లా అధికారి ఆంజనేయులు శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం 90 శాతం రాయితీపై డ్రిప్ అందజేసిందన్నారు. డ్రిప్ పనితీరు సంతృప్తికరంగా ఉందని తెలిపారు. మిగతా రైతులకు కూడా ఈ పథకం ఆదర్శంగా ఉండేటట్లు చూడాలని రైతుకు సూచించారు. అలాగే నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో బొప్పాయి పంట సాగుకు డ్రిప్‌ను అందజేశామన్నారు. బిందు సేద్యం వల్ల మొక్కలకు అవసరమైన మేర నీరు అంది దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతు తెలిపినట్లు చెప్పారు. రాయితీపై ఇచ్చే డ్రిప్ పథకాన్ని వినియోగించుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి రైతులు లాభాలు ఆర్జించాలని సూచించారు.

దాసునాయన మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో శుక్రవారం మఠాధిపతుల ప్రవచనాల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా గుంటూరు బ్రహ్మం మఠం పీఠాధిపతి యానాదుల సత్యనారాయణ, చిరుమామిళ్ళ అమ్మవారి పీఠం పీఠాధిపతి భక్తానందస్వామి, వేజెండ్ల పేరిరెడ్డి పీఠాధిపతి జగన్నాధరెడ్డి, తడికమళ్ళ వెంకటరెడ్డి పాల్గొని వేదాంత పరిచయం, వేద పఠనం చేశారు. అనంతరం పీఠాధిపతులను స్థానిక పీఠాధిపతి కటారు దాసునాయన, కటారు శ్రీనివాసరావు, హనుమాయమ్మ సత్కరించారు.

మూతపడ్డ రేమిడిచర్ల రైతు సేవ కేంద్రం

బొల్లాపల్లి: మండలంలో రైతు సేవ కేంద్రాల తలుపులకు తాళాలు దర్శనమిస్తున్నాయి. గత రెండు రోజులుగా రేమిడిచర్ల రైతు సేవ కేంద్రం తలుపు మూసి ఉందని, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో ఏమైనా సలహాల కోసం వెళ్తే తాళాలు వేసిన తలుపులు దర్శనమిస్తున్నాయని అంటున్నారు. అదే విధంగా మేళ్లవాగు రైతు సేవ కేంద్రం నుంచి ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. దీనిపై ఏఈవో అప్పారావును అడగ్గా రేమిడిచర్ల వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు నాయక్ ఈ-క్రాప్ నమోదుకు వెళ్తూ డోర్స్ లాక్ చేయాల్సి వస్తుందని, మేళ్లవాగులో ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు.

జాన్‌డేవిడ్ సేవలు స్ఫూర్తిదాయకం

చిలకలూరిపేట: డాక్టర్ ఎస్ జాన్‌డేవిడ్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమైనవని ఫార్‌కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ కొనియాడారు. ఏఎంజీ, ఫార్‌కార్నర్స్, వేద స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ జాన్‌డేవిడ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న జాన్‌డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఎంజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బర్నబాస్ మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి చెరువు ఏర్పాటుకు జాన్‌డేవిడ్ చేసిన కృషిని పట్టణ ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ సులక్షణ్, బోర్డు సభ్యులు సాంబయ్య, మోజెస్, పాస్టర్లు పీటర్, ప్రసన్న పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి


డీటీ మురళికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

వినుకొండ: సాక్షి పత్రిక సంపాదకులు ఆర్.ధనంజయరెడ్డిపై నమోదు చేసిన కేసులను, రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి విలేకరులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి హేయం


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ర్యాలీ చేస్తున్న ఎంఆర్పీయస్ నాయకులు

చిలకలూరిపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించటం అత్యంత హేయమైన, అహంకారపూరిత చర్య అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ విమర్శించారు. సీజేఐపై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు అద్దంకి బాబు మాదిగ, కోటి మాదిగ, బిరుదు కిరణ్, నాగేశ్వరరావు, అడపా రవి, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రొంపిచర్లలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చెరువు కట్ట సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మక్కెన పుట్టయ్య మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయడం దారుణమన్నారు. తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల కో ఇన్‌చార్జి కొమ్ము ప్రకాష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, డీటీ సల్మాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై దాడి భారత రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు.

నరసరావుపేట: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కనుమూరి కోటేశ్వరరావు మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ మాట్లాడుతూ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై సూమోటోగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడు కలపాల చరణ్ మాదిగ, పట్టణ ఉపాధ్యక్షుడు ఉట్టి మహేంద్ర మాదిగ, ఎమ్మెస్‌ఎఫ్ టౌన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న వరదరాజన్

నరసరావుపేట రూరల్: విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలతో పాటు వ్యాపార దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వ్యాల్యూ ట్రిన్ సర్వీసెస్ ఫౌండర్ అండ్ చైర్మన్ వరదరాజన్ కృష్ణ తెలిపారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఇగ్నైట్ ఇన్నోవేషన్, ఇంట్రాప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్స్‌పై వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరదరాజన్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ విద్యార్థుల భవిష్యత్‌ను మలిచే శక్తి అని తెలిపారు. ఉద్యోగాలు కోరుకునే వారిగా కాకుండా ఆవిష్కరణలు సృష్టించే నాయకులుగా ఎదగాలని అన్నారు. డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్, సులభంగా స్టార్టప్‌ను ఎలా ప్రారంభించాలి అనే అంశాలపై ప్రసంగించారు. యువత తమ ఆలోచనలను వ్యాపారాలుగా మలచాలని సూచించారు. వర్క్‌షాప్‌లో 34 టీమ్‌ల నుంచి 136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీటీఎస్ కో-ఫౌండర్ రామ్ మారూరి, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము వెంకటేశ్వర్లు, డీన్ డాక్టర్ ఎస్‌వీఎస్ శ్రీనివాసు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్


టాస్ వేస్తున్న సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, ఎంఈవో కృష్ణారెడ్డి

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి, హెచ్‌ఎం నిర్మల ప్రారంభించారు. మండల స్థాయిలో 12 పాఠశాలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో అండర్-14 ఖోఖో, బాలుర విభాగంలో అండర్-17 వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమాలను మండల ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, పీఈటీలు హనిమిరెడ్డి, హుస్సేన్, మున్నంగి సుబ్బారావు, ఖాదర్‌మస్తాన్, షేక్ బాజీ, శ్రీనివాసులు, సత్యవతి, రాణి, హనుమాయాదవ్, ఉపాధ్యాయులు కెల్లంపల్లి రెడ్డియ్య చౌదరి ఉన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు వాగ్దేవి విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మాదినేని వెంకటేశ్వర్లు (బేస్‌బాల్), ఎస్.లోకేంద్రసాయిశ్రీనాథ్ (సాఫ్ట్ బాల్) అండర్-19 జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్‌లో కడప, గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్నాడు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

పశువులకు ఉచిత వైద్య శిబిరం



నూజెండ్ల: కృత్రిమ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యి దూడలను పొందే ఆధునిక సాంకేతికతను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి పి.రామారావు అన్నారు. మండలంలోని ముక్కెళ్ళపాడులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స పశు వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పెయ్యి దూడల పుట్టుకను ఇచ్చే కృత్రిమ గర్భధారణ వీర్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక గర్భ నిర్ధారణ ద్వారా విదేశీ జాతులతో పాటు స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్ వంటి బ్రీడ్‌లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వినుకొండ ఏడీఏ శ్రీరాములు మాట్లాడుతూ పచ్చి మేత, దాణాతో పాటు మునగాకు, కరివేపాకు, చిరుధాన్యాలు అందిస్తే పశువులు త్వరగా చూడు కడతాయన్నారు. శిబిరంలో 45 పశువులకు గర్భకోశ పరీక్షలు 45 గేదెలకు నట్టల నివారణ మందులు, 21 జీవాలకు సాధారణ చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. డీఎల్‌డీఏ టి.సుధాకర్, వైద్యులు శివాజీ, హమీర్ బాషా, మనోజ్, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో నైపుణ్యాలు సాధించాలి

హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి



యడ్లపాడు: బాలికలు ప్రాథమిక దశ నుంచే అన్ని రంగాల్లో నైపుణ్యాలను సాధించాలని హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. లింగారావుపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఐటీసీ, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన పోటీల్లో హైస్కూల్లో 6, 7 తరగతుల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థినులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీ, పురుష లింగబేధం లేకుండా బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రవేశం పొందాలన్నారు. ఇందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పీఈటీ మేరీశౌరీ, అసిస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.